ఎర్ర బంగారంపై నిఘా !

కడప బ్యూరో - ప్రభన్యూస్: కడప జిల్లాలో 3.15 లక్షల హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంది. ఇక్కడ శేషాచలం, నలమల, లంకమల అటవీ ప్రాంతాల్లో ఎర్రచందనం ప్రకృతి సిద్ధంగా లభిస్తుంది. అందుకే స్మగ్లర్లు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇటీవల కడప జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణా తగ్గుముఖం పట్టినా అక్కడక్కడ స్మగ్లింగ్ జరుగుతోంది. దీన్ని నివారించేందుకు అటవీ శాఖ సిబ్బంది నిత్యం అడవులను జల్లెడ పడుతున్నారు. పగలు.. రాత్రి తేడా లేకుండా కూంబింగ్ సాగిస్తున్నాము. అటవీ సమీప గ్రామాల ప్రజలను చైతన్యం చేయడంతో పాటు స్మగ్లర్లుగా ముద్రపడ్డ వారి కార్యకలాపాలను నిత్యం పరిశీలిస్తున్నాము. ప్రత్యేక నిఘా ఉంచాము. ఫలితంగా అక్రమ రవాణా చేసే ఎర్రచందనం పట్టుబడుతోందని డీఎఫ్ఓ సందీప్ రెడ్డి చెప్పారు. బేస్ క్యాంపు, స్ట్రైకింగ్ ఫోర్స్, చెక్‌పోస్టుల ద్వారా ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాము. అయితే ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న బడా స్మగ్లర్లను కూడా పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా వన్యప్రాణుల సంరక్షణ కూడా ఎంతో కీలకం. జిల్లాలో అత్యంత విలువైన వన్యప్రాణులు ఉన్నాయి. కొంత మంది వేటగాళ్లు వన్యప్రాణులను చంపి వాటి మాంసం విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. అటువంటి వారి పట్ల కూడా తాము కఠినంగా వ్యవహరిస్తున్నాము. ఇటీవల వేంపల్లి, గాలివీడు మండలాలను కొంతమంది వన్యప్రాణులను చంపిన గతంలో తమ దృష్టికి వచ్చాయి. వారిని వెంటనే అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచాము. అటవీ జంతువులను

పట్టుపడ్డ ఎర్రచందనం (ఫైల్)

చంపిన వారిని క్షమించేది లేదని డీఎఫ్ఓ సందీప్ రెడ్డి స్పష్టం చేశారు.

కలివి కోడి పై కొనసాగుతున్న సర్వే..

ప్రపంచంలోనే అత్యంత అరుదైన కలివికోడి ఉనికిపై సిద్ధవటం రేంజ్ కోడూరు బీట్ లో సర్వే కొనసాగుతోందని డీఎఫ్ఓ చెప్పారు. అత్యాధునిక కెమెరాలతో పాటు ప్రత్యేక బృందాలు అధ్యయనం చేస్తున్నాయి. వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పరిశోధన కొనసాగుతోంది. 46 వేల హెక్టార్లలో శ్రీ లంకమల్ల అభయారణ్యం వైల్డ్ లైఫ్ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు డీఎఫ్ఓ సందీప్ రెడ్డి తెలిపారు. అడవులను కాపాడుకుంటూనే పర్యావరణ పరిరక్షణ నిమిత్తం మొక్కల పెంపకానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. కడప, బద్వేల్, ప్రొద్దుటూరు సబ్ డివిజన్ ల పరిధిలోని 9 బీట్ లలో మొక్కల పెంపకం చేపడుతున్నాము. పోరుమామిళ్లలోని వెంకటాపురంలో 5 మొక్కలు, వనిపెంటలో 1 లక్ష మొక్కలు, కడప రాజీవ్ స్మృతి వనంలో 50 వేల మొక్కలు, బద్వేల్ లో 85 వేల మొక్కలతో కలిపి మొత్తం 2.40 లక్షల మొక్కలను నర్సరీలో అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. విద్యార్థులను, మేధావులను, ఉద్యోగులను భాగస్వామ్యం చేసి మొక్కల పెంపకాన్ని చేపట్టేందుకు తమ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని డీఎఫ్ఓ చెప్పారు. కడప ప్రజలకు ప్రకృతితో కూడిన ఆహ్లాదాన్ని పంచడానికి నగరవనాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రొద్దుటూరు పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు రాజీవ్ గాంధి నేషనల్ పార్కును అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కాగా.. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి పర్యావరణ అనుమతులు అన్ని సకాలంలోనే లభిస్తున్నాయని డీఎఫ్ఓ సందీప్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గంలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి కూడా కేంద్ర పర్యావరణ అనుమతులు లభించాయని ఆయన తెలిపారు.

సిబ్బంది పనితీరు అభినందనీయం..

డీఎఫ్ఓ పీవీ సందీప్ రెడ్డి

అటవీ శాఖ సిబ్బంది పనితీరు అభినంద నీయమని డీఎఫ్ఓ సందీప్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా నిత్యం దట్టమైన అటవీ ప్రాంతంలో కూడా కూంబింగ్ నిర్వహిస్తూనే ఉన్నారని తెలిపారు. తాము గుర్తించిన ప్రతి ఎర్రచందనం చెట్టును పరిరక్షించుకుంటూ సిబ్బంది పనిచేస్తున్నారని చెప్పారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు కూడా అటవీ సిబ్బందికి సహకరిస్తున్నారని తెలిపారు. స్మగ్లర్లు అడవుల్లోకి ప్రవేశించకుండా తాము నిత్యం కాపలాకాస్తున్నామన్నారు. తమ నిఘాను మరింత పెంచి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టి అటవీ సంపదను కాపాడతామని డీఎఫ్ఓ స్పష్టం చేశారు.

రాష్ట్రమంతా వైసీపీ నాయకులు భూ దందాలు

ఇసుక మాఫియాలో 10వేల కోట్లు దోచుకున్నారు

భూ దందాలో భాగస్వాములు అయినా అధికారులపై చర్యలు తప్పవు..

కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి

కడప రూరల్ జూలై 18 (ప్రభ న్యూస్): వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని,1 లక్ష 75 వేల ఎకరాల భూ దందాలు చేసి, 35 వేల కోట్లు దోచుకొని, దాచుకున్నారని కడప నియోజకవర్గ ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి లెక్క వేసి చెప్పారు. ద్వారకా నగర్ లో ఆమె నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి

వైసిపి ఎమ్మెల్యేలు, నాయకులు భూ దందాల ద్వారా ఆక్రమించుకున్న భూములు, స్థలాలు వారివిగా సవరణ చేసుకోవడానికి జీవో నెంబర్ 512 ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తీసుకురావడం దుర్మార్గమని, టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవోను రద్దు చేసిందని ఆమె గుర్తు చేశారు. 10 లక్షల ఇండ్ల నిర్మాణానికి సరిపడ నదీ సంపద అయిన ఇసుకను అక్రమంగా తరలించి పదివేల కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. 40 వేల ఎకరాలు ప్రభుత్వ భూములు తక్కువ ధరకు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. రైతుల భూములకు సంబంధించిన పాసుబుక్కులపై జగన్ బొమ్మ ముద్రించేందుకు కోట్లు ఖర్చు చేయడం, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం కాదా అని ప్రశ్నించారు. కడపలో ప్రభుత్వ భూములను, వంకలను వెంచర్లలో కలుపుకున్నారని, చలమారెడ్డి పల్లి, వైయస్సార్ కాలనీ వద్ద కొండను కొల్లగొట్టి, గ్రావెల్ తరలించి అక్రమంగా కోట్ల రూపాయలు దోచుకొని , దాచుకున్నారన్నారు. గౌస్ నగర్ లో ఒకటిన్నర ఎకరా కబ్జా చేశారన్నారు. మినిస్టర్ లేఅవుట్ లో ప్రభుత్వ భూమిగా సూచిక బోర్డు పెడితే, మాజీ ఎమ్మెల్యే మనుషులు బోర్డును తొలగించారన్నారు. మాజీ ఎమ్మెల్యేపై,భూ దందాల్లో భాగస్వామ్యమైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత టిడిపి హయాంలో ఏర్పాటైన టిడ్కో ఇండ్లను లబ్ధిదారులకు త్వరగా ఇవ్వాలనే ఉన్నామన్నారు. సీసీ రోడ్డు ఏర్పాటుకు స్థానిక ప్రజల నుండి ఇంటికి రూ, 10 వేలు వసూలు చేయడం, ఆ పార్టీ నాయకుల దిగజారుడు సంపాదనకు నిదర్శనం అన్నారు. భూ దందాలు చేసిన నాయకులు ఏ పార్టీకి సంబంధించిన వారైనా చర్యలు తీసుకుని, భూములు, స్థలాలు ప్రజలకు ఉపయోగపడేలా ఏర్పాటు చేస్తామన్నారు.

కరెంట్ కోతలతో విసుగెత్తిపోతున్న ప్రజలు: సీఐటీయు

జమ్మలమడుగుటౌన్ జులై 18(ప్రభ న్యూస్): సీఐటీయూ అధ్యక్షకార్యదర్శులు జి ఏసుదాసు,దాసరివిజయ్ లు ఎన్జీ హోమ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జమ్మలమ డుగు అలాగే సంబంధిత పరిసర మండలాలలో రాత్రి పగలు తేడా లేకుండా కరెంటు కోతలు పెడుతున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జమ్మలమడుగు పట్టణంలో రాత్రి పగలు తేడా లేకుండా గంటల తరబడి కరెంటు పోవడంతో అన్ని హాస్పిటల్స్ లో ఉన్న రోగులు మరిన్ని సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందిఅని అన్నారు. కరెంటు అధికారులకు ప్రతిరోజు శనివారమే అవుతుందని ప్రజలు మండిపడుతున్నారని అన్నారు. చిన్నపాటి గాలి వర్షం వచ్చిన గంటల తరబడి కరెంటు రాదు అని అన్నారు.కరెంటు కోతల వల్ల రైతులకు,దుకాణాల దారులకు ప్రభుత్వ ఆఫీసులలో పనిచేస్తున్న అధికారులు ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వారు అన్నారు.ప్రభుత్వాలుఎన్ని మారిన రాజకీయ నాయకులు ఎంత మంది వచ్చినా ప్రజల అవసరాలు తీర్చలేక పోతున్నారని వారు మండిపడ్డారు.ఈ కార్యక్రమంలోబాబు,శీను,శేఖర్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు

దళితులకు అన్యాయం జరగకూడదు

జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో కడప కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప ప్రతినిధి, జూలై 18 (ప్రభ న్యూస్) : దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదని, జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలాని.. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధ్యక్షతన సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తోపాటు ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డిఆర్వో గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబందించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. అలాగే వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిస్కరించాలని కమిటీ సభ్యులైన అధికారులను ఆదేశించారు. ఈ కమిటీలో బాధితులకు పరిష్కారం అందించడం ఒక ఎత్తయితే.. భవిష్యత్తులో అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ దిశగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అలాగే నిమ్న వర్గాల ప్రజలపై వివక్ష, అఘాయిత్యాలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జరగకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం జరగకుండా చర్యలు చేపడుతోం దన్నారు. దళితుల అభ్యున్నతికి.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని.. ఎక్కడ వారు అన్యాయానికి గురి కాకుండా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు.. ప్రత్యేక పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు.

గత సమావేశంలో చర్చించిన విషయాలలో చాలా అంశాలను పరిష్కరించామని, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తదుపరి సమావేశం నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గతంలో నమోదైన కేసుల స్థితిని కూడా ఒకసారి తిరిగేయాలని జిల్లా కలెక్టర్ కమైటీ సభ్యులకు సూచించారు. సామాజిక రుగ్మతలను దూరం చేసి.. అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ చేపడుతున్న చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతినెలా 30వ తేదీన నిర్వహించే మానవ హక్కుల దినోత్సవం నాడు.. ఒక్కో మండలంలోని ప్రధాన పాఠశాలలో విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు, ఆయా ప్రాంతాల్లోని ప్రజప్రతినిధులను సమన్వయం చేసుకుని అట్రాసిటీ కేసులు నమోదుకాకుండా అవగాహనా పెంచాలన్నారు. సమాజంలో నేరాలను తగ్గించేలా, అట్రాసిటీ చర్యలకు పాల్పడితే పడే శిక్ష, కేసులు, సెక్షన్లు తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ...

జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే పోక్సో చట్టం, బాల్య వివాహాలు నిరోధక చట్టం పైన ప్ర జల్లో అవగాహన సదస్సులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు.. బాల్య వివాహాలను అరికట్టే చర్యల్లో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఆర్డీవోలు, డిఎస్పీలు మండల స్థాయి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి.. ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు ఏమైనా ఉంటే కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం సంబంధిత కేసుల అంశాలను..

ఆయా శాఖల నుండి హాజరైన విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ వివరంగా అడిగి తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో అన్ని డివిజన్ల ఆర్.డి.ఓ లు సంబందిత డిఎస్పీలు, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, ఎస్సి కార్పొరేషన్, మైనరి కార్పోరేషన్ ఈడి డా.వి. బ్రహ్మయ్య, కమిటీ సభ్యులైన సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్రిమాశీలక సభ్యత్వం

కలసపాడు జులై 18 (ప్రభన్యూస్) ఈ జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదు కార్యక్రమం బద్వేల్ నియోజకవర్గం లోని పోరుమామిళ్ల నూతన జనసేన పార్టీ కార్యాలయంలో కల్సపాడు కాసినాయన బి కోడూరు పోరుమామిళ్ల మండలానికి సంబంధించిన క్రియాశీలక వాలంటీర్లు ఈ యొక్క కార్యక్రమాన్ని ప్రారంభించారు. నంద కిషోర్. మొలతాటి మాట్లాడుతూ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏ రాజకీయ పార్టీ ఇప్పటివరకు ఇటువంటి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేయలేదు. మొట్టమొదటి సారిగా పార్టీ కార్యకర్తల యోగక్షేమాలకై ఆలోచించి ప్రవేశపెట్టిన విధానమే పార్టీ క్రియా శీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం .ఇటువంటి విధానాన్ని తీసుకువచ్చిన జనసేన పార్టీ గౌరవ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎంపవన్ కళ్యాణ్ గారికి జనసేన పార్టీ బద్వేల్ నియోజక

సమావేశంలో పాల్గొన్న జనసేన పార్టీ నాయకులు

వర్గం తరపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటూ, ఇటువంటి మహా యజ్ఞం లో పార్టీ కార్యకర్తలు నాయకులు భాగస్వామ్యం అయ్యి ప్రజలందరికీ అవగాహన కల్పించి ఈ యొక్క కార్యక్రమమును విజయవంతం చేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో కలసపాడు అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి కాశి నాయన మండల అధ్యక్షులు ఖలీల్ భాషా పోరుమామిళ్ల మండల అధ్యక్షులు లక్ష్మయ్య బి. కోడూరు మండల అధ్యక్షుడు శివశంకర్ జనసేన నాయకులు రమణయ్య మధు సుదన్ రెడ్డి ఇమ్రాన్ రఘు మస్తాన్ పవన్ బాబు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : 501, సల్‌కాన్ అరుం, జసోలా జిల్లా సెంటర్, కొత్తఢిల్లీ - 110025

సిఐఎన్ : యు65900డిఎల్2020పిఎల్‌సి366027

వేలం ప్రకటన

శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క దిగువ తెల్పిన రుణగ్రహీతలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంక్ వారి నుండి వారిచే పొందిన బంగారంపై రుణం/లు బ్యాంకు వారిచే జారీచేయబడిన వ్యక్తిగత నోటీసులతో సహా వివిధ డిమాండ్లు మరియు నోటీసులు ఇచ్చినప్పటికి వారిచే సేర్పుబాటు చేయబడలేదు రుణగ్రహీతలందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంకు వారితో సెక్యూరిటీగా ఉంచిన బంగారు ఆభరణాలు వేలం వేయుటకు నిర్ణయించబడినది మరియు రుణాలు పొందిన శాఖ ఆవరణలలో తదనుగుణంగా 29.07.2024న మ॥03.00గం॥లకు వేలం తేదీగా నిర్ణయించబడినది. రుణగ్రహీతలతో సహా అందరు ఖాతాదారులు మరియు యావన్మంది ప్రజలు వేలం యొక్క నియమనిబంధనల ప్రకారం ఈ వేలంలో పాల్గొనగలరు.

శాఖ	ఖాతా నెం.	ఖాతాదారుని పేరు	తండ్రి/ భర్త లేదా భార్య పేరు	చిరునామా	ఖాతా తెరచిన తేది	చెల్లించవలసిన మొత్తం
జూబ్లీహిల్స్	103942510499	నాగదాసరి ఎం బాబు	తండ్రి నాగదాసరి చిన్న ఓబయ్య	5 48 విజయ, రామాపురం, అనంతరాజపురం, కడప, ఆంధ్రప్రదేశ్ -516228	15/02/2024	167,831.6

వేలం తేది : 29.07.2024న మ॥03.00గం॥లకు

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం నుండి ఏదేని ఖాతాను తొలగించుట లేదా రద్దు చేయుటకు బ్యాంకు వారు హక్కు కలిగి ఉన్నారు.

సం/- అధీకృత అధికారి, శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్